GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# T MEDIA టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్ : గురువారం - అక్టోబర్ 19- 2023 - పేజీలు - 3

### ప్రవళిక కుటుంబసభ్యులు కు...

## మంత్రి కేటీఆర్ పరామర్శ



**టీ మీడియా, అక్టోబర్ 18, హైదరాబాద్:** ఇటీవల హైదరాబాద్లో ఆత్మహత్యకు పాల్పడ్డ మ్రరి ప్రవళిక కుటుంబసభ్యులు మంత్రి కేటీఆర్ను కలిశారుప్రవళిక మరణానికి శివరామ్ అనే వ్యక్తి కారణం అని, అతన్ని కఠినంగా శిక్షించాలని ఆమె కుటుంబసభ్యులు మంత్రిని కోరారు. ప్రవళిక మరణం చాలా దురదృష్ట కరమని మంత్రి కేటీఆర్ వారికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సంఘటనకు సంభందించిన అన్ని వివరాలు డీజీపీ ద్వారా తెలుసుకున్నాను అని, ప్రవళిక మృతికి కారణమైన వ్యక్తికి తప్పకుండా తగిన శిక్ష పడేలా చూస్తామని మంత్రి వారికి తెలిపారు. ప్రవళిక కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని, ఆమె సోదరుడికి ఉద్యోగం ఇప్పిస్తానని ప్రవళిక కుటుంబ సభ్యులకు మంత్రి హామీ ఇచ్చారు.

# మోదీ సర్కార్ తీపి కబురు

**-కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు**

**-ఉద్యోగులకు బంపర్ ఆఫర్**

**-రైతులకు పెద్ద ఉపశమనం**

**టీ మీడియా, అక్టోబర్ 18, న్యూఢిల్లీ:** త్వరలో ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల వేళ.. కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. దసరా, దీపావళి పండుగల వేళ కేంద్ర ఉద్యోగులకు బంపర్ ఆఫర్ ప్రకటించింది కేంద్ర ప్రభుత్వం. అలాగే రైతులకు మోదీ ప్రభుత్వం పెద్ద ఉపశమనం కల్పించింది. ఉద్యోగులకు కరువు భత్యాన్ని 4 శాతం పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. జూలై 1, 2023 నుండి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డియర్నెస్ అలవెన్స్, పెన్షనర్ల డియర్నెస్ రిలీఫ్ను 4 శాతం పెంచాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. దీంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ 42 శాతం నుంచి 46 శాతానికి పెరిగింది.దీంతో పాటు రైల్వే ఉద్యోగులకు బోనస్ ఇచ్చేందుకు కూడా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. రైల్వేలోని నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు 78 రోజుల జీతానికి సమానమైన బోనస్ ఇవ్వనున్నట్లు కేబినెట్ సమావేశం అనంతరం కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు.ఆరు రబీ పంటలపై మద్దతు ధరలను పెంచాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. నూనె గింజలు, ఆవాలు క్వింటాలుకు రూ.200 పెంచారు. ముతక ధాన్యాల ఉత్పత్తిని పెంచేందుకు అన్నదాతలను పోత్సాహించేలా నిర్ణయం తీసుకున్నారు. కందులు



క్వింటాల్కు రూ.425, గోధుమలు క్వింటాల్కు రూ.150, బార్లీ క్వింటాల్కు రూ.115, మినుము క్వింటాల్కు రూ.105 చొప్పున పెంచినట్లు అనురాగ్ ఠాకూర్ తెలిపారు.అలాగే లడఖ్ ప్రాంతానికి సంబంధించి సమావేశంలో నాలుగో నిర్ణయం తీసుకున్నట్లు అనురాగ్ ఠాకూర్ తెలిపారు. ఆగస్టు 15, 2020న ఎర్రకోట నుండి లడఖ్ కోసం 7.5 గిగావాట్ల సోలార్ పార్క్ను ఏర్పాటు చేస్తామని ప్రధాని మోదీ ప్రకటించారు. కొత్త పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ ఈ దిశలో 13 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడానికి ఒక ప్రణాళికను రూపొందించింది. సౌర విద్యుత్ ప్లాంట్లు నిర్మించినప్పుడు, ట్రాన్స్మిషన్ లైన్లు చాలా ముఖ్యమైనవి. లడఖ్ నుండి ప్రధాన గ్రిడ్కు విద్యుత్ను తీసుకురావడానికి 5 గిగావాట్ల సామర్థ్యం గల లైన్ కోసం కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.లడఖ్ నుంచి హర్యానాలోని కైతాల్ వరకు 5 గిగావాట్ల కెపాసిటీ లైన్ నిర్మించనున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. ఇది హిమాచల్ ప్రదేశ్, పంజాబ్ వంటి రాష్ట్రాల గుండా వెళుతుంది. ఇది జాతీయ గ్రిడ్కు అనుసంధానించడం జరుగుతుందన్నారు. ఈ మొత్తం ప్రాజెక్టు ఏడేళ్లలో పూర్తి చేయాలని కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.

# విశాఖకు సరికొత్త హంగులు

**-మిలీనియం టవర్స్లో ప్రభుత్వ కార్యాలయాలు**



**టీ మీడియా, అక్టోబర్ 18 విశాఖపట్నం:** వైజాగ్ ఇక ఇంటర్నేషనల్ లెవల్లో ఐకాన్గా మారబోతుంది. ఆంధ్రప్రదేశ్ పరిపాలన రాజధానిగా సరికొత్త హంగులను సంతరించుకుంటోంది సాగరతీరం. డిసెంబర్ నుంచి ఏపీ పరిపాలన ఇక విశాఖపట్నం నుంచే మొదలు కానుంది. ఈమేరకు వసతులు సిద్ధమవుతున్నాయి కూడా! అవును.. డిసెంబర్ లోగా విశాఖ కేంద్రంగా పరిపాలన సాగుతుందని స్పష్టం చేశారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి.విశాఖపట్నంకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయం తరలింపునకు కౌంట్ డౌన్ మొదలైంది. డిసెంబర్ లోగా విశాఖ కేంద్రంగా పరిపాలన సాగుతుందని స్పష్టత ఇచ్చారు సీఎం వైఎస్ జగన్. తాను కూడా విశాఖకు షిఫ్ట్ అవుతానన్నారు. సీఎంవో సహా సంబంధిత కార్యాలయాల ఏర్పాటుకు సంబంధించి త్రిసభ్య కమిటీ క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తుందన్నారు. డిసెంబర్ లోపు విశాఖకు మారుతామన్నారు. అక్టోబర్ నెలలోనే విశాఖకు షిఫ్ట్ అవ్వాలనుకున్నప్పటికీ.. డిసెంబర్ నుంచి విశాఖలోనే ఉంటానన్నారు జగన్. మధురవాడ ఐటీ హిల్స్లో ఇన్ఫోసిస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఈ కామెంట్స్ చేశారాయన. విశాఖ ఐటీ హబ్ మారుతున్నందుకు సంతోషంగా వుందన్నారు.ఈ నేపథ్యంలోనే విశాఖపట్నంలో పలు ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు రంగం సిద్ధమవుతుంది. ఇందుకోసం వివిధ భవనాలను అధికారుల త్రిసభ్య కమిటీ పరిశీలించినట్లు తెలుస్తుంది. వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం డిసెంబర్ నుంచి విశాఖ నుంచి ప్రభుత్వ కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు సీఎం జగన్ సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా మునిసిపల్,

మిగతా 2లో...

**టీ మీడియా, అక్టోబర్ 18, ములుగు బ్యూరో:** దొరల తెలంగాణ ప్రజల తెలంగాణకు మధ్య ఎన్నికలు జరుగుతున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు %ొ%బుధవారం సాయంత్రం ములుగు జిల్లాలో జరిగిన సభలో ప్రియాంక గాంధీ తో కలిసి పాల్గొన్న రాహుల్ గాంధీ బీజేపీ, బీఆర్ యస్ ఎంఐఎం పార్టీలు ఒక్కటే అని వారికీ కాంగ్రెసును ఓడించడమే లక్ష్యమని వారి ప్రజా వ్యతిరేక విధానాలపై

తెలిసినప్పటికీ తెలంగాణ ఆకాంక్ష మేరకు ప్రత్యేక రాష్ట్రం ఇచ్చామని కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ అన్నారు. ములుగులో నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరీ సభలో ఆమె మాట్లాడుతూ%ొ% కాంగ్రెస్ ఎప్పుడూ ప్రజల ఆకాంక్షలకే విలువ ఇచ్చిందన్నారు. ప్రత్యేక తెలంగాణ కావాలనుకున్న మీ కల నెరవేరిందని, కానీ ప్రత్యేక రాష్ట్రం వచ్చాక సామాజిక న్యాయం కొరవడిందన్నారు.తెలంగాణ వస్తే యువత ఆత్మహత్యలు ఆగుతాయని, రైతుల

# దొరల తెలంగాణ ... ప్రజల తెలంగాణ మధ్య ఎన్నికలు

జీవితాలు

**-బీజేపీ ,బీఆర్ యస్ ,ఎంఐఎం ఒక్కటే**

**-బీఆర్ యస్ పాలనలో రాష్ట్రం లూటీ**

**- మాఫియా రాజ్యమేలుతుంది.**

**-ములుగు సభలో రాహుల్ గాంధీ.ప్రియాంక గాంధీ**









ధ్వజమెత్తారు %ొ%బీఆర్ యస్ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేదని ప్రజల బలిదాల ఫలితంగా ఏర్పడ్డ తెలంగాణ దొరల చేతులో బందీ అయిందని విమర్శలు గుప్పించారు . సీఎం కేసీఆర్ అనేక అవినీతి కార్యక్రమాలకు పాల్పడ్డ కేంద్రంలోని బీజేపీ సర్కార్ సిబిఐ, ఈడీ , ఇన్ కం టాక్స్ సంస్థల ద్వారా ఎలాంటి దాడులు జరిపించలేదని అదే బీజేపీ ,బీఆర్ యస్ మధ్య బంధానికి తార్కాణమని అన్నారు .కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకుని తెలంగాణ ఇచ్చిందని వెల్లడించారు. సాధారణంగా రాజకీయ పార్టీలు తమకు నష్టం కలిగే నిర్ణయాలు తీసుకోవని, కానీ తాము అన్నింటికీ సిద్ధపడే తెలంగాణ ఇచ్చామని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. నాడు నష్టం జరుగుతుందన్న ఆలోచనే లేకుండా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను గౌరవించాలన్నదే నాడు తమ ఆలోచన అని వివరించారు.ఇక, తెలంగాణలో బీఆర్ఎస్ పాలనకు కాలం చెల్లిందని అన్నారు. కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసినట్టు రాహుల్ విమర్శించారు. నిరుద్యోగ యువతను కేసీఆర్ వంచించారని, దళితులకు 3 ఎకరాల భూమి ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. రూ.1 లక్ష రుణ మాఫీ అన్నారని, అదైనా గుర్తుందా, లేదా? అంటూ నిలదీశారు.బీఆర్ఎస్ పాలనలో భారీగా అవినీతి చోటుచేసుకుందని రాహుల్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లక్ష కోట్లు జేబులో వేసుకున్నారని, ధరణి పోర్టల్ లోనూ అవినీతి చోటు చేసుకుందని ఆరోపించారు. తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో గెలిచేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అభివృద్ధిఅనేగ్యారెంటీతోతెలంగాణలోకాంగ్రెస్రప్రభుత్వఏర్పాటు కానుందని స్పష్టం చేశారు.కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఏం చెప్పామో అదే చేశామని, తెలంగాణలోనూ ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని పేర్కొన్నారు. రాజస్థాన్ లో ఉచిత వైద్యం, కర్ణాటకలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని చెప్పామని, ఆ మేరకు అమలు చేస్తున్నామని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే పోడు భూములు, అసైన్డ్ భూముల విషయంలో న్యాయం చేస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు.

### బీఆర్ యస్ పాలనలో రాష్ట్రం లూటీ

తాము నష్టపోతామని

బాగుపడతాయని భావించారని, కానీ బీఆర్ఎస్ పాలనలో అవేమీ జరగలేదన్నారు. మీ ఆశలను అడియాసలు చేసిందన్నారు. రాజకీయ లబ్ధి కోసం ఆలోచించకుండా తాము తెలంగాణను ఇచ్చామన్నారు. నెహ్రూ నుంచి సోనియా వరకు అందరూ దీర్ఘకాలిక ప్రయోజనాల గురించే ఆలోచించినట్లు చెప్పారు. ఇప్పటికైనా మీ ఆశలు, ఆశయాలు నెరవేరాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు.తెలంగాణలో నలభై లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారన్నారు. రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే వరికి రూ.2500, మొక్కజొన్నకు రూ.2200 మద్దతు ధర ఇస్తామన్నారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామన్నారు. ఇందిరమ్మ భరోసా కింద రూ.15వేలు ఇస్తామన్నారు.ఈసభకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులూ పొన్నం ప్రభాకర్ అధ్యక్షత వహించగా , రాష్ట్ర కాంగ్రెస్ వ్యవరాల ఇంచాగే మాణిక్యరావు ఠాక్రే , పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి , సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క , ఎంపీలు ఉత్తమ్ కుమార్ రెడ్డి , కోమటిరెడ్డి వెంకటరెడ్డి , ఎమ్మెల్యేలు శ్రీధర్ బాబు ,పొదెం వీరయ్య , సీతక్క , జగ్గారెడ్డి , మాజీ మంత్రి జానారెడ్డి ,బలరాం నాయక్ , కొండా సురేఖ తదితరులు పాల్గొన్నారు .

# శ్రీశైలం ఎవరి అయ్య జాగీరు

## తెలంగాణ పైసలు లేవా?

**-నాలుగు నెలల్లో లక్షా 50 ఎకరాలకు సాగునీరు**

**-ముఖ్యమంత్రి కేసీఆర్**

**టీ మీడియా, అక్టోబర్ 18,జడ్చర్ల:** సభలో సీఎం కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు..తెలంగాణను ఉత్తిగా ఇవ్వలేదు, విద్యార్థులను బలి తీసుకొని ఇచ్చారు.. శ్రీశైలం ఎవరి అయ్య జాగీరు..? శ్రీశైలంలో మన తెలంగాణ పైసలు లేవా?.. పాలమూరు-ఎత్తిపోతల పథకాన్ని జూరాల నుంచి శ్రీశైలం ప్రాజెక్ట్కు మార్చాం. టన్నెల్స్ పుర్తయ్యాయి, మోటార్లు బిగిస్తున్నారు. ఇప్పుడు కూడా కొందరు జూరాల నుంచే నీళ్లు తీసుకోవాలని మాట్లాడుతున్నారు. రాబోయే మూడు, నాలుగు నెలల్లో లక్షా 50 ఎకరాలకు సాగునీరు అందిస్తాం.. కరువు మనవైపు కన్నెత్తి కూడా చూడదు.. అంటూ బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు పేర్కొన్నారు. జడ్చర్లలో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగించిన సీఎం కేసీఆర్.. కాంగ్రెస్ పార్టీపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అంతేకాకుండా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అభివృద్ధి, తదితర అంశాలపై ప్రసంగించారు. జడ్చర్లను అద్భుతంగా తీర్చి దిద్దుకున్నాం.. మహబూబ్నగర్ నా గుండెల్లో ఉంటుందంటూ కేసీఆర్ పేర్కొన్నారు. మహబూబ్నగర్ చరిత్రలో నిల్చిపోతుందని వివరించారు.మహబూబ్ నగర్ దరిద్రం పోవాలంటే ఎంపీగా పోటీచేయాలని జయశంకర్ సార్ చెప్పారని.. మహబూబ్ నగర్ ఎంపీగా ఉంటూనే తెలంగాణ సాధించాననే కీర్తి చిరకాలం ఉంటుందని కేసీఆర్ పేర్కొన్నారు. నడిగడ్డలో ఒక ఊర్లో ఏడ్చానని.. కృష్ణ నది పక్కనే పారుతున్నా.. గుక్కెడు నీళ్ళు లేవు.. ముఖ్యమంత్రుల పర్యటనలు, నాటకాలు చూశామని.. మహబూబ్ నగర్ ఎప్పటికీ తన గుండెల్లో ఉంటుందంటూ పేర్కొన్నారు. జూరాల బెత్తెడు ప్రాజెక్ట్.. అందులో ఉండేది 9 టీఎంసీలు.. రోజుకు 2 టీఎంసీలు తీసుకుంటే మూడు రోజుల్లో ఖాళీ అవుతుంది. శ్రీశైలం వాళ్ల జాగీరా..? అందుకే అక్కడి నుంచి తీసుకుందామని చెప్పామన్నారు. అప్పటి సన్నాసులు, దద్దమ్మలు ఇప్పుడు కూడా మాట్లాడుతున్నారు.. వాళ్ళు ఈ జిల్లాలో ఎలా పుట్టారో తెలవడం లేదంటూ మండిపడ్డారు. నాడు, నేడు వాళ్ళది భావ దారిద్ర్యమే.. తెలంగాణ ఎవ్వడో ఊరికే వచ్చి ఇచ్చిపోలేదన్నారు. పిడికిలి ఎత్తి పోరాటం చేస్తే, అనేక మందిని బలితీసుకుని.. బాధలు పెట్టారని.. తాను ఆమరణ నిరాహార దీక్ష చేపడితే తెలంగాణ వచ్చిందంటూ కేసీఆర్ పేర్కొన్నారు.ఇదే జిల్లాలో పుట్టిన కాంగ్రెస్ నేతలు కేసులు వేసి అడ్డం పడ్డారని.. రాబోయే మూడు, నాలుగు నెలల్లో అన్ని రిజర్వాయర్లలో నీళ్ళు చూస్తారంటూ కేసీఆర్ హామీనిచ్చారు. లక్షా 50వేల ఎకరాలకు నీళ్ళు వస్తాయి.. అదే జరిగితే కరువు కన్నెత్తి కూడా చూడ దంటూ పేర్కొన్నారు.

పరిశ్రమల కేంద్రంగా జడ్చర్లను తీర్చిదిద్దే బాధ్యత తనదని.. పాలమూరు జిల్లా పాలుగారే జిల్లాగా, బంగారు తునకగా మారుతుందంటూ పేర్కొన్నారు. అందరినీ కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నామని.. గణపతి నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ పండుగ ఒకేసారి వస్తే ముస్లిం సోదరులు వాయిదా వేసుకున్నారంటూ గుర్తుచేశారు.





ఇది అసలైన గంగా జమునా తహజీబ్ అంటూ కేసీఆర్ వ్యాఖ్యానించారు. తాను పుట్టించిందే రైతు బంధు పథకమని.. ప్రపంచంలో ఎక్కడా లేదని కేసీఆర్ పేర్కొన్నారు. రూ.37వేల కోట్ల రైతురుణాల మాఫీ చేశామని.. 10 ఏళ్లలో తెలంగాణ రైతు దేశంలోనే గొప్ప రైతుగా మారుతాడన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రైతులకు 3గంటల కరెంటు సరిపోతుందని తన కడుపులోని మాట బయట పెట్టారని.. వాళ్ళు వస్తే కరెంటు కట్ అవుతుందన్నారు. ప్రధాని సొంత రాష్ట్రంలో 24గంటల కరెంట్ లేదని.. కాంగ్రెస్ వస్తే రైతుబంధును ఆపేస్తారంటూ పేర్కొన్నారు. తాము మళ్లీ అధికారంలోకి రాగానే ఉద్దండపుర్ బాధితులకు నష్ట పరిహారం వెంటనే అందిస్తామని.. కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కేసీఆర్ కోరారు.



# న్యూజిలాండ్ భారీ విజయం

**- ఆఫ్ఘనిస్థాన్ 149 పరుగుల తేడాతోపరాజయం**

**టీ మీడియా, అక్టోబర్ 18, హైదరాబాద్:** వరల్డ్ కప్ లో మొన్న ఇంగ్లండ్ పై సంచలన విజయం సాధించిన ఆఫ్ఘనిస్థాన్ న్యూజిలాండ్ తో తలపడగా, ఫలితం ఎలా ఉంటుందన్న దానిపై ఆసక్తి నెలకొంది. ఇంగ్లండ్ ను ఓడించిన ఊపులోనే ఆఫ్ఘనిస్థాన్%ొ% న్యూజిలాండ్ కు కూడా ఓటమి రుచి చూపిస్తుందా%ొ%? అంటూ చర్చ జరిగింది. కానీ ఇవాళ న్యూజిలాండ్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య చెన్నైలోని చెపాక్ స్టేడియంలో జరిగిన మ్యాచ్ లో ఎలాంటి సంచలనం నమోదు కాలేదు. న్యూజిలాండ్ జట్టు ఘనంగా గెలిచింది. ఎన్నో ఆశలతో ఈ మ్యాచ్ బరిలో దిగిన ఆఫ్ఘన్లు 149 పరుగుల తేడాతో ఘోర పరాజయం చవిచూశారు. ఈ పోరులో టాస్ గెలిచిన ఆఫ్ఘనిస్థాన్ బౌలింగ్ ఎంచుకుంది. దాంతో మొదట బ్యాటింగ్ చేసిన కివీస్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లకు 288 పరుగులు చేసింది. 289 పరుగుల లక్ష్యఛేదనలో ఆఫ్ఘనిస్థాన్ 34.4 ఓవర్లలో 139 పరుగులకే కుప్పకూలింది. ఆఫ్ఘన్ ఇన్నింగ్స్ పరిశీలిస్తే, ఏ దశలోనూ లక్ష్యంగా దిశగా వెళు తున్నట్టు అనిపించలేదు. భారీ భాగస్వామ్యాలు నెలకొల్పడంలో ఆఫ్ఘన్ బ్యాటర్లు విఫలమయ్యారు. కివీస్ బౌలర్లలో లాకీ ఫెర్గుసన్ 19 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు. శాంట్నర్ కు 3, బౌల్ట్ కు 2, మాట్ హెన్రీ 1, రచిన్ రవీంద్ర 1 వికెట్ తీశారు. ఆఫ్ఘన్ జట్టులో రహ్మత్ షా 36 పరుగులతో టాప్ స్కోరర్ గా నిలిచాడు. అజ్మతుల్లా ఒమర్జాయ్ 27, వికెట్ కీపర్ ఇక్రమ్ అలీఖిల్ 19 పరుగులు చేశారు. స్టార్ ఓపెనర్ రహ్మనుల్లా గుర్బాజ్ 11 పరుగుల స్వల్ప స్కోరుకే వెనుదిరగడం ఆఫ్ఘనిస్థాన్ ఛేజింగ్ ను ప్రభావితం చేసింది.

# విశాఖకు సరికొత్త హంగులు

## -మిలీనియం టవర్స్‌లో ప్రభుత్వ కార్యాలయాలు

ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులతో పాటు పరిపాలనశాఖ కార్యదర్శులతో కూడిన త్రిసభ్య కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీ మిలీనియం టవర్స్‌తో పాటు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు భవనాలను పరిశీలించినట్టు సమాచారం. ప్రధానంగా మిలీనియం టవర్స్‌లో అందుబాటులో ఉన్న 2 లక్షల చదరపు అడుగుల భవనాలను అధికారుల త్రిసభ్య కమిటీ పరిశీలించినట్లు తెలుస్తోంది. ఇక్కడే ప్రధాన ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు సానుకూలంగా ఉన్నట్టు గుర్తించినట్లు సమాచారం. అలాగే గ్రే హౌండ్స్‌లో ఉన్న భవనాలనూ కమిటీ పరిశీలించింది. ఇక్కడ పోలీసుశాఖ ప్రధాన కార్యాలయం ఏర్పాటుకు అవకాశం ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. వీఎంఆర్‌డీఏ కు చెందిన వివిధ భవనాలను కూడా త్రిసభ్య కమిటీ స్వయంగా పరిశీలించింది. వీఎంఆర్‌డీకు చెందిన భవనాల్లో మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు వైద్యారోగ్యశాఖకు చెందిన ఉన్నతాధికారులు అరిలోవలోని విమ్స్ నుంచి విధులకు హాజరయ్యే అవకాశం ఉందని త్రిసభ్య కమిటీ ప్రాథమికంగా భావించినట్టు సమాచారం. ఇక ఇక్కడకు వచ్చే అధికారులకు అవసరమైన వసతి సౌకర్యాలను మాత్రం ఆయా శాఖలే చూసుకోవాలని కమిటీ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

# బిజెపి, కాంగ్రెస్‌ను గెలిపిస్తే 50 ఏళ్లు వెనక్కి వెళ్తాం

## - మంత్రి కేటీఆర్



**టీ మీడియా, అక్టోబర్ 18, కరీంనగర్ :** తెలంగాణ ఉద్యమానికి కరీంనగర్‌లోనే బీజం పడిందని మంత్రి కేటీఆర్ అన్నారు. కరీంనగర్‌లో ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొని ఆయన ప్రసంగించారు. 'కొత్త రాష్ట్రం తెలంగాణను రెండుసార్లు కేసీఆర్ చేతుల్లో పెట్టారు. బిఆర్ఎస్ పాలనలో ఎన్ని మార్పులు వచ్చాయో గమనించాలి. కరీంనగర్‌లో ఎన్ని అభివృద్ధి పనులు పూర్తి చేశామో చూడండి. కరీంనగర్‌లో తాగునీటి సమస్య పరిష్కరించాం. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎక్కడ చూసినా జలకళే కనిపిస్తోంది. బిజెపి, కాంగ్రెస్‌ను గెలిపిస్తే 50 ఏళ్లు వెనక్కి వెళ్తాం. బిఆర్ఎస్ పాలనలో పల్లెలు బాగుపడుతున్నాయి. గిరిజన తండాల్లో రోడ్లు వస్తున్నాయి. కరెంటు ఉంది. మళ్లీ అధికారంలోకి వచ్చాక పింఛన్ రూ.5 వేలు చేస్తాం. వెయ్యి గురుకులాలు ఉన్న రాష్ట్రం తెలంగాణ ఒక్కటే. చదువుకుంటామనే పిల్లలకు రూ.20 లక్షలు ఇచ్చి విదేశాలకు పంపుతున్నాం' అని కేటీఆర్ వివరించారు. మరోవైపు కరీంనగర్ నుంచి గెలిచిన ఎంపీ ఈ ఐదేళ్లలో ఏదైనా పని చేశారా?అని కేటీఆర్ నిలదీశారు. గంగుల కమలాకర్‌పై పోటీ అంటేనే అందరూ పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ వాళ్లు హుస్నాబాద్ పారిపోయారు.. బీజేపీ వాళ్ళు పోటీకి వెనుక ముందు అవుతున్నారు. కేసీఆర్ అందరి నాయకుడు.. హిందూ, ముస్లింలకు అందరికీ నేత అని స్పష్టం చేశారు. కేసీఆర్ అందరి కంటే గొప్ప హిందువు.. యాగాలు, యజ్ఞాలు చేశారని తెలిపారు. ఇక్కడ ఎంపీ మసీదులు తవ్వుదాం అంటాడు. బొందల గడ్డలు తవ్వడానికా ఎంపీ అయింది సంజయ్ అని కేటీఆర్ నిలదీశారు. పునాదులు తవ్వండి.. అభివృద్ధి కోసం పునాదులు వేయండి అని పిలుపునిచ్చారు. చావు నోట్లో తలపెట్టిన కేసీఆర్ ఒకవైపు%రా% తెలంగాణ కోసం రాజీనామా చేయకుండా పారిపోయిన బీజేపీ కిషన్ రెడ్డి, ఓటుకు నోటు దొంగ థర్డ్ క్లాస్ క్రిమినల్ రేవంత్ రెడ్డి మరోవైపు ఉన్నారని కేటీఆర్ తెలిపారు. రాహుల్ వస్తాడు.. ప్రియాంక వస్తుంది.. మోసపోకండి. కరీంనగర్‌లో పోటీ చేస్తే ఏమవుతుందో కాంగ్రెస్, బిజెపి నేతలకు తెలుసనని బిఆర్ఎస్ గెలుపుపై కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.



# తెలంగాణ ఎన్నికల్లో పోటీపై నిర్ణయం తీసుకుంటా

## – జనసేన అధినేత పవన్

టీ మీడియా, అక్టోబర్ 18, హైదరాబాద్ : తెలంగాణ ఎన్నికలు సమీపిస్తోన్న వేళ .. బరిలో దిగి గెలుపొందేందుకు ప్రధాన ప్రతిపక్ష పార్టీలన్నీ కసరత్తులు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ ఎన్నికల్లో పోటీ విషయమై 2, 3 రోజుల్లో నిర్ణయాన్ని తీసుకుంటానని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. బుధవారం హైదరాబాద్‌లోని జనసేన రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో పవన్ కల్యాణ్ సమావేశమయ్యారు. ఎన్నికల్లో పోటీపై పార్టీ నేతలు వారి అభిప్రాయాలను పవన్‌కు వివరించినట్టు రాష్ట్ర నాయకత్వం వెల్లడించింది. కొత్త రాష్ట్రంలో రాజకీయ గందరగోళానికి తావివ్వకూడదన్న కారణంగా గత ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నామని పేర్కొంది. మిత్రపక్షమైన బిజెపి విజ్ఞప్తి మేరకు హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికలకు కూడా దూరంగా ఉన్నామని తెలిపింది. రానున్న ఎన్నికల్లో కూడా జనసేన పోటీ చేయకపోతే క్యాడర్ బలహీనపడే అవకాశం ఉందని జనసేన నేతలు తమ అభిప్రాయాలను పవన్ దృష్టికి తీసుకెళ్లారు. నేతల అభిప్రాయాలను విన్న జనసేన అధినేత తన మీద ఒత్తిడి ఉన్న మాట వాస్తవమేనని, నాయకులు, జన సైనికుల అభిప్రాయాలకు విలువ ఇస్తానని అన్నారు. సరైన నిర్ణయం తీసుకోవడానికి 2, 3 రోజుల సమయం అవసరమని కోరారు. దీనిపై జనసేన ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ సమావేశంలో పార్టీ ఉపాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, తెలంగాణ శాఖ ఇన్‌ఛార్జి నేమూరి శంకర్ గౌడ్, రాష్ట్ర నాయకులు రామ్ తాళ్లూరి, హైదరాబాద్ నగర అధ్యక్షుడు రాజలింగం, ప్రధాన కార్యదర్శి ఎం.దామోదర్ రెడ్డి, వివిధ నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

# యూజర్లకు షాక్ ఇచ్చిన ట్విట్టర్..

## ఇకపై పోస్ట్ పెట్టాలంటే డబ్బు కట్టాల్సిందే

టీ మీడియా, అక్టోబర్ 18, న్యూఢిల్లీ: ప్రముఖ మైక్రోబ్లాగింగ్ సైట్ ట్విట్టర్ ఎక్స్ వినియోగదారులకు షాక్ ఇచ్చింది. ఎక్స్‌లో 'నాట్ ఎ బాట్' అనే కొత్త సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ ను అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం ట్విట్టర్ కొత్త యూజర్లు పోస్ట్ చేయాలన్నా, వేరొకరి ట్వీట్‌ను రీ ట్వీట్ చేయాలన్నా, రిప్లే ఇవ్వాలన్నా, లైక్ కొట్టాలన్నా కొంత మేర డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. ఈ సబ్‌స్క్రిప్షన్ ఫీజు ఏడాదికి ఒక డాలర్‌గా సంస్థ వసూలు చేయనుంది. ఈ కొత్త నిబంధనను మొదట న్యూజిలాండ్, ఫిలిప్పీన్స్‌లో ప్రయోగాత్మకంగా టెస్ట్ చేస్తున్నారు. స్పామ్, ఆటోమేటెడ్ బాట్ అకౌంట్లను తగ్గించాలనే ఉద్దేశంతోనే ఈ కొత్త నిబంధనను తీసుకొచ్చినట్లు ట్విట్టర్ తెలిపింది. అయితే, సభ్యత్వం పొందకూడదనుకునే కొత్త వినియోగదారులు పోస్ట్‌లను చదవడం, వీడియోలను వీక్షించడం, ఖాతాలను అనుసరించే వెసులుబాటు ఉంటుంది.

# ఎన్నికలప్పుడే వచ్చి మాయ మాటలు చెప్పేవాళ్లను నమ్మొద్దు

## - ఎమ్మెల్సీ కవిత



**టీ మీడియా, అక్టోబర్ 18, భోధన్:** కాంగ్రెస్, బీజేపీల నేతలకు ఎన్నికల టైమ్‌లో వచ్చి ఓట్ల కోసం మాయమాటలు చెప్పడం అలవాటుగా మారిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. తెలంగాణ ప్రజలు రాజకీయంగా చాలా చైతన్యం కలిగి ఉన్నారని, కల్లబొల్లి మాటలు నమ్మి ఓట్లేసే పరిస్థితిలో తెలంగాణ సమాజం లేదని ఆమె చెప్పారు. బుధవారం ఉదయం నిజామాబాద్ జిల్లా బోధన్ పర్యటనలో కవిత మాట్లాడారు. రాహుల్ గాంధీ ఇప్పుడు బీసీ జనగణన గురించి మాట్లాడుతున్నారని, కానీ సంక్షేమంలో బీసీలకు పెద్దపీట వేసిందే కేసీఆర్ అనే సంగతి గుర్తుంచుకోవాలని కవిత హితవుపలికారు. నిజామాబాద్ జిల్లాలో 2014కు ముందు ఒక్కటే బీసీ హాస్టల్ ఉండేదని, ఇప్పుడు కేసీఆర్ పాలనలో బీసీ హాస్టల్‌ల సంఖ్య 15కు పెరిగిందని కవిత చెప్పారు. బీసీ బిడ్డలను విదేశాలకు పంపి చదివిస్తున్న ఏకైక ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమని, ఇది బీసీ సాధికారత అవునో కాదో..? రాహుల్‌గాంధీయే చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీని చంద్రబాబు ప్రైవేటు పరం చేసినప్పుడు ఇక్కడి కాంగ్రెస్ నేతలు ఎందుకు నోరు మెదపలేదో రాహుల్‌గాంధీ చెప్పాలన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చినంక ప్రభుత్వం చెరుకు రైతులను అన్ని విధాలుగా ఆదుకున్నదని, రైతులను కళ్లల్లో పెట్టుకుని కాపాడుకునే నైజం కేసీఆర్‌ది అయితే, ఆ రైతులపై రాజకీయాలు చేసే నైజం రాహుల్‌గాంధీది అని కవిత విమర్శించారు. ఎన్నికలప్పుడే వచ్చి మాయ మాటలు చెప్పే వాళ్లను నమ్మాలో లేదంటే ఎల్లప్పుడూ వెంట ఉండి పనిచేసే వాళ్లను నమ్మాలో ప్రజలే ఆలోచించుకోవాలని ఎమ్మెల్సీ కవిత సూచించారు. ముఖ్యమంత్రిని మార్చాలనుకున్నప్పుడల్లా మత కల్లోలాలు రెచ్చగొట్టిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. ఇప్పుడు హిందూ ముస్లింలు కలిసిమెలిసి మత సామరస్యంతో పండుగలు చేసుకుంటున్నారని చెప్పారు. 65 ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇక్కడి ప్రజలకు మంచి నీళ్లుగానీ, సాగు నీళ్లుగానీ, మంచి విద్యగానీ, మంచి వైద్యంగానీ ఎందుకు ఇవ్వలేకపోయిందో రాహుల్‌గాంధీ చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. పార్లమెంట్ సాక్షిగా ప్రధాని మోదీ తెలంగాణపై అక్కసు వెళ్లగక్కుతుంటే రాహుల్‌గాంధీగానీ, సోనియాగాంధీగానీ ఎందుకు అడ్డుకునే ప్రయత్నం చేయలేదని ఆమె ప్రశ్నించారు. ఇవాళ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏదీ చేస్తే అది దేశమంతా అనుసరించే పరిస్థితి ఉన్నదని, ఇప్పటికే తెలంగాణ సర్కారు చేసిన ఎన్నో కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు దేశానికి మార్గదర్శనంగా మారాయని కవిత చెప్పారు. నిజామాబాద్ పర్యటనకు వస్తున్న రాహుల్‌గాంధీకి స్వాగతం పలుకుతున్నామని, ఆయన మా అంకాపూర్ చికెన్ రుచి చూడాలని, అంకాపూర్ చికెన్ భారతదేశంలో చాలా పాపులర్ అని కవిత వ్యాఖ్యానించారు.

# వారసత్వ రాజకీయాలపై రాహుల్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

## - అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ




**టీ మీడియా, అక్టోబర్ 18, న్యూఢిల్లీ :** కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్‌ల కుమారులను ప్రస్తావిస్తూ బీజేపీ నేతలవి వారసత్వ రాజకీయాలు కాదా అని ప్రశ్నించిన కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ దీటుగా బదులిచ్చారు. రాహుల్‌కు రాజకీయాలు తెలియవని, ఆయన చదువులేని బచ్చా అని మండిపడ్డారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కుమారుడు జే షా బీసీసీఐ పదవిలో కొనసాగుతుండగా, మరో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ యూపీ ఎమ్మెల్యేగా వ్యవహరిస్తుండగా వీరిని ఉద్దేశించి రాహుల్ మిజోరాం ఎన్నికల ప్రచారం సందర్భంగా కాషాయ పార్టీపై విమర్శలు గుప్పించారు. అమిత్ షా కొడుకు భారత్‌లో క్రికెట్‌ను నడిపిస్తున్నారని, అలాగే రాజ్‌నాథ్ సింగ్ కొడుకు యూపీ రాజకీయాల్లో ఉన్నారని వారసత్వ రాజకీయాల విషయంలో గాంధీ కుటుంబాన్ని విమర్శించే కాషాయ పార్టీ దీనికి ఏం సమాధానం చెబుతుందని రాహుల్ నిలదీశారు. రాహుల్ వ్యాఖ్యలపై అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ దీటుగా స్పందిస్తూ అమిత్ షా కొడుకును ఎందుకు తెరపైకి తీసుకువచ్చారని ప్రశ్నించారు. అమిత్ షా కొడుకు రాజకీయాల్లో లేడని, కానీ రాహుల్ కుటుంబం మొత్తం రాజకీయాల్లో ఉందని అన్నారు. బీసీసీఐ బీజేపీ విభాగం అని రాహుల్‌అనుకుంటున్నారా అని ప్రశ్నించారు. రాజ్‌నాథ్ సింగ్ కుమారుడు యూపీలో కేవలం ఓ ఎమ్మెల్యే మాత్రమేనని, అతడిని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీతో పోల్చగలమా, ఆయన బీజేపీని కంట్రోల్ చేసే స్థాయిలో ఉన్నాడా అని శర్మ పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ముందుగా కొత్తవారికి అవకాశాలు అప్పగించి ఆపై వారసత్వ రాజకీయాల గురించి మాట్లాడాలని హితవు పలికారు.

# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ పెంపు



**టీ మీడియా, అక్టోబర్ 18, న్యూ ఢిల్లీ :** కేంద్ర ఉద్యోగులకు మోడీ ప్రభుత్వం మరో సారి గుడ్ న్యూస్ చెప్పింది. దసరా, దీపావళికి ముందు ప్రభుత్వం నుంచి పెద్ద బహుమతి లభించింది. తాజాగా కేంద్ర కేబినెట్ సమావేశం నిర్ణయాన్ని ప్రకటించింది. దీపావళికి ముందే ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు మోడీప్రభుత్వం పెద్ద కానుకను అందించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్ల కరువు భత్యం పెంపునకు ఆమోదం తెలిపింది. డియర్‌నెస్ అలవెన్స్‌లో 4 శాతం పెంపుతో 42 శాతం నుంచి 46 శాతానికి పెంచింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో 47 లక్షల మంది ఉద్యోగులు, 68 లక్షల మంది పెన్షనర్లకు లబ్ధి చేకూరనుంది. కరువు భత్యం పెంపుతో పాటు కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్లకు అక్టోబర్ నెల జీతం కూడా వచ్చే అవకాశాలు ఉన్నాయి. జూలై నుంచి సెప్టెంబర్ వరకు ఉన్న బకాయిలను కూడా అక్టోబర్ నెల జీతంతో పాటు కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్లకు ఇవ్వాలని నిర్ణయించింది. అలాగే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2022-23 సంవత్సరానికి బోనస్‌గా రూ.7,000ను అందిస్తున్నట్లుగా ఆర్థిక మంత్రిత్వ శాఖ మంగళవారం గరిష్ట పరిమితిని నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని గ్రూప్ బీ, గ్రూప్ సీల్లోకి వచ్చే నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు కూడా బోనస్ అందించింది. ఇది కాకుండా, కేంద్ర పారామిలిటరీ బలగాలు, సాయుధ దళాల ఉద్యోగులకు అడహాక్ బోనస్ ప్రయోజనం కూడా ఇవ్వనుంది. ఈ బోనస్‌లో భాగంగా 30 రోజుల జీతంతో సమానంగా డబ్బు అందిస్తోంది.

# జనవరి నెల శ్రీవారి ఆర్జిత సేవల రిజిస్ట్రేషన్ ప్రారంభం



**టీ మీడియా, అక్టోబర్ 18, తిరుమల :** తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలను జనవరి నెలలో నిర్వహించుకోవాలని వేచి చూస్తున్న యాత్రికులకు సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన తదితర ఆర్జిత సేవలకు రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభమయ్యాయి. బుధవారం నుంచి 20వ తేదీ ఉదయం 9.59 గంటల వరకు ఈ ఆర్జిత సేవల కోసం తమ పేర్లను ఆధార్ నంబర్ సాయంతో బుక్ చేసుకోవచ్చు. టీటీ దేవస్థానమ్స్ యాప్ నుంచి కానీ, టీటీడీ అధికారిక బుకింగ్ పోర్టల్ నుంచి కానీ బుక్ చేసుకోవచ్చు. లక్కీ డీప్ లో ఎంపికైన యాత్రికులకు 20వ తేదీ సమాచారం వస్తుంది. ఎంపికైన యాత్రికులు 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల్లోపు ఫీజు చెల్లించి ఖరారు చేసుకోవాలి. ఇక జనవరి నెలకు సంబంధించి కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ సేవల కోసం ఈ నెల 21న ఉదయం 10 గంటల నుంచి బుక్ చేసుకోవచ్చు. ఇవే సేవలకు ఆన్ లైన్ లో వర్చువల్ గా పాల్గనే వారికి సంబంధించి స్లాట్లను 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. జనవరి నెలలో అంగప్రదక్షిణ కోటా టోకెన్ లను ఈ నెల 23వ తేదీ ఉదయం 20 గంటలకు విడుదల చేయనున్నారు. ఇక జనవరి నెలకు సంబంధించి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను ఈ నెల 24న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. వఅద్ధులు, దివ్యాంగుల కోటా దర్శన టికెట్లను 23న మధ్యాహ్నం 3 గంటల నుంచి బుక్ చేసుకోవచ్చు. తిరుమల, తిరుపతి అకామడేషన్ బుకింగ్ ఈ నెల 25 లేదా 26వ తేదీల్లో ఉంటుంది.

# ఉగ్రమూకలే ఆసుపత్రిపై దాడి చేశాయి - ఐడీఎఫ్ కాదు

## - ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు



**టీ మీడియా, అక్టోబర్ 18, గాజా :** గాజాలో మంగళవారం ఘోర ఘటన జరిగింది. సెంట్రల్ గాజాలోని అల్ అహ్లీ సిటీ ఆసుపత్రిపై జరిపిన వైమానిక దాడిలో 500 మంది పాలస్తీనియన్లు మరణించారు. ఈ దుర్ఘటన పశ్చిమాసియా దేశాలను ఉలిక్కిపడేలా చేసింది. అయితే ఈ ఘటనపై హమాస్-ఇజ్రాయెల్ పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నాయి. ఈ దారుణానికి ఇజ్రాయెల్ వైమానిక దాడులే కారణమని హమాస్ ఆరోపించగా.. ఇది ఉగ్రమూకల దుశ్చర్యేనని ఇజ్రాయెల్ సైన్యం చెబుతోంది. ఇజ్రాయెల్ వైమానిక దాడులే ఈ దుర్ఘటనకు కారణమని హమాస్ ఆరోపించడాన్ని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఖండించారు. " ఈ విషయాన్ని యావత్ ప్రపంచం తెలుసుకోవాలి. గాజాలోని అనాగరిక ఉగ్రమూకలే.. అక్కడి ఆసుపత్రిపై దాడి చేశాయి. ఐడీఎఫ్ (ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్) కాదు. మా పిల్లలను అతి దారుణంగా హత్య చేసిన ఆ ఉగ్రవాదులు.. ఇప్పుడు వారి పిల్లలను కూడా చంపేస్తున్నారు " అని నెతన్యాహు ఆరోపించారు. అటు 'ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్' కూడా ఇదే విషయాన్ని వెల్లడించింది. ఆసుపత్రి సమీపంలో పీఐజే మిలిటెంట్లు ప్రయోగించిన రాకెట్ గురితప్పి ఆసుపత్రిలో పేలుడు సంభవించిందని పేర్కొంది. ఈ మేరకు ఐడీఎఫ్ అధికారిక ఎక్స్ (ట్విటర్) ఖాతాలో ఓ వీడియో, కొన్ని పోస్టులు చేసింది.

# కుమ్మర సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా కోడూరు చంద్రయ్య



**టీ మీడియా, అక్టోబర్ 18, జన్నారం:** మండలంలోని పోనకల్ గ్రామానికి చెందిన కోడూరు చంద్రయ్య కుమ్మర సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఇటీవల జనగామ జిల్లా కేంద్రంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర కుమ్మరుల సంఘం రాష్ట్ర స్థాయి సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆకారపు మోహన్ ఆధ్వర్యంలో కోడూరి చంద్రయ్య ను రాష్ట్ర స్థాయి సంఘం గౌరవ అధ్యక్షులుగా నియమించారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి గౌరవ అధ్యక్షునిగా నియమించినందుకు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆకారపు మోహన్ ,కార్యవర్గ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. సంఘ నియమ నిబంధనలకు పాటిస్తూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

# డిజిటల్ పద్ధతిలో విద్యుత్ బిల్లులు చెల్లించండి



**టీ మీడియా, అక్టోబర్ 18, తాండూర్ :** మంచిర్యాల జిల్లా తాండూరు మండలంలో విద్యుత్ ఏఈ ప్రభాకర్ ఇంటింటా తిరుగుతూ కరెంటు బిల్లులు డిజిటల్ పద్ధతిలో చెల్లింపులు ఎలా చేయాలో అవగాహన కల్పిస్తూ వివిధ రకాల డిజిటల్ ఆప్స్ ఫోన్ పే గూగుల్ పే టీ వాలెట్ గురించి వివరిస్తూనే సకాలంలో బిల్లుల చెల్లింపులకు సహకరించగలరని కోరారు. మీరు ఎప్పుడు కావాలంటే అప్పుడు విద్యుత్ బిల్లులను ఫోన్ ద్వారా చెల్లించవచ్చని విద్యుత్ ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన పనిలేదని వివరించారు. ఆన్లైన్ బిల్లుల చెల్లింపు పారదర్శకతతో భద్రతతో పాటు వెంటనే మీ యొక్క సర్వీసు కు జమ చేయబడుతుంది. ఆన్లైన్లో విద్యుత్ బిల్లులు చెల్లించడం ద్వారా సమయం కూడా వృధా కాకుండా ఉంటుందని చెప్పారు విద్యుత్ను ఆదా చేస్తే మనం విద్యుత్ తయారు చేసినట్టే అని ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు.

# నడిగూడెం కళాశాలలో బతుకమ్మ వేడుకలు



**టీ మీడియా, అక్టోబర్ 18, నడిగూడెం :** నడిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ వేడుకలను కళాశాల ప్రిన్సిపాల్ మన్నెం సోమయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బతుకమ్మ పాటలకు నృత్యాలు చేశారు. అనంతరం స్థానిక సాగర కాలువలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, కళాశాల సిబ్బంది,విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మూడోసారి ముచ్చటగా బీఫామ్ అందుకున్న ఎమ్మెల్యే



**టీ మీడియా, అక్టోబర్ 18, తాండూర్:** బి ఆర్ ఎస్ పార్టీ తరఫున సీఎం కేసీఆర్ మూడోసారి బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మె నేనుల్యే దుర్గం చిన్నయ్యకు బీఫామ్ ఇచ్చిన సందర్భంగా తాండూరు మండలం బీఆర్ఎస్ పార్టీ నాయకులు మూడోసారి కూడా విజయకేతనం ఎగురవేయాలని ఎమ్మెల్యేకు శాలువాతో సన్మానించి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాండూరు గ్రామపంచాయతీ కో ఆప్షన్ సభ్యులు ఎలుక రామచందర్ సింగిల్ విండో చైర్మన్ దత్తు మూర్తి రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు దత్తాత్రేయ మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్ గుప్తా నాయకులు రాజన్న పాల్గొన్నారు.

# చంద్రబాబు బెయిల్ పిటీషన్ విచారణ మరోసారి వాయిదా



**టీ మీడియా, అక్టోబర్ 18, అమరావతి :** టిడిపి అధినేత చంద్రబాబు ముందస్తు బెయిల్ పై విచారణను మరోసారి వాయిదా వేసింది ఏపీ హైకోర్టు. నవంబరు 7వ తేదీకి వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది కోర్టు. ఇన్నర్ రింగ్ రోడ్డు(ఏఆర్ఆర్) కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ చంద్రబాబు హైకోర్టులో పటీషన్ ను విచారించిన ఏపీ హైకోర్టు.. నవంబరు 7వ తేదీకి వాయిదా వేస్తున్నట్లుగా తెలిపింది. అయితే అప్పటి వరకు ఆయనను అరెస్ట్ చేయవద్దంటూ ఆదేశాలు జారీ చేసింది..

# ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు పై చీటింగ్ కేసు



**టీ మీడియా, అక్టోబర్ 18, ఆదిలాబాద్ :** ఒకే భూమిని ఇద్దరు వ్యక్తులకు విక్రయించినందుకు బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు పై ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఎమ్మెల్యే 2012లో ఆదిలాబాద్ సమీపంలోని బట్టి సమర్గం సర్వే నెంబర్ 53/2లో రెండు గంటల భూమిని ఆదిత్య ఖండేకర్ అనే వ్యక్తికి విక్రయించారు. తిరిగి ఆ ప్లాట్లను 2019లో సంతోష్ అనే వ్యక్తి కొన్నారు. మొదట కొనుగోలు చేసిన ఆదిత్య ఖండేకర్ కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావుతోపాటు సుదర్శన్ అనే వ్యక్తిపై 420, 421, 409,426 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు సీఐ అశోక్ తెలిపారు.


# కల్పవృక్ష వాహనంపై మలయప్ప



**టీ మీడియా, అక్టోబర్ 18, తిరుమల :** శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన బుధవారం ఉదయం మలయప్పస్వామి కల్పవృక్ష వాహనంపై రాజమన్నార్ అలంకారంలో దర్శనమిచ్చారు. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాలు భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు సర్వభూపాల వాహనంపై స్వామివారు దర్శనమివ్వనున్నారు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ఎవి.ధర్మారెడ్డి, పలువురు బోర్డు సభ్యులు, జేఈవో సదా భార్గవి, సివిఎస్వో నరసింహ కిషోర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ముదురుతున్న ఓట్ల పంచాయితీ

## -పోటాపోటీగా వైసీపీ, టీడీపీ ఫిర్యాదులు




**టీ మీడియా, అక్టోబర్ 18,అమరావతి :**ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలకు సుమారు ఏడాది సమయం ఉంది. అప్పుడు అధికార వైసీపీ-టీడీపీ ల మధ్య ఓట్ల పంచాయితీ షురూ అయ్యింది. రాష్ట్రంలో వెలుగుచూస్తున్న దొంగ ఓట్ల వ్యవహారంపై ఎన్నికల సంఘానికి పోటాపోటీగా ఫిర్యాదు చేసుకున్నారు. ఓట్ల తొలగింపుపై నాలుగు నెలల క్రితం నుంచే తెలుగుదేశం పార్టీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు ఎవరికి వారే రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిని కలుస్తున్నారు. ఆయా పార్టీల తరపున పలు ఫిర్యాదులు చేస్తున్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో ఓటర్ల జాబితా రీవెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. అక్టోబర్ 27న డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ ప్రకటిస్తామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్ కుమార్ మీనా ప్రకటించారు. దీంతో గత వారం రోజులుగా నకిలీ ఓట్ల అంశంపై మరోసారి ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువస్తున్నారు రెండు పార్టీల నేతలు. గతంలో ఇదే అంశంపై కేంద్ర ఎన్నికల సంఘానికి అధికార విపక్షాల నేతలు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. ఆ తర్వాత ఓట్ల తొలగింపునకు సంబంధించి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది రాష్ట్ర ఎన్నికల సంఘం.ముఖ్యంగా అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలో ఓట్ల తొలగింపునకు సంబంధించి అధారాలు బయటపడటంతో పెద్ద ఎత్తున దుమారమే రేగింది. ఈ నేపథ్యంలో ఇద్దరు అధికారులను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది ఎన్నికల సంఘం. ఇలా ఎప్పటికప్పుడు తమకు అందిన ఫిర్యాదులపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటుంది. ఈ క్రమంలోనే తాజాగా రెండు పార్టీల నేతలు రెండు రోజుల వ్యవధిలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిని కలిసి వేరువేరు ఫిర్యాదులు ఇచ్చారు.

బీఎల్‌వోలపై చర్యలకు టీడీపీ డిమాండ్

రెండు రోజుల క్రితం తెలుగుదేశం పార్టీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతల బృందం ఎన్నికల సంఘాన్ని కలిసి ఫిర్యాదు చేసింది. రాష్ట్రంలో ఓట్ల దొంగలు పడ్డారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. ప్రతిపక్ష సానుభూతి పరుల ఓట్లను తొలగించడం.. చీల్చడం కోసం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసుకున్నారని ఆరోపించారు. వాలంటీర్ వ్యవస్థ ద్వారా ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడుతున్నారని సీఈవోకు ఫిర్యాదు చేశారు తెలుగు దేశం పార్టీ నేతలు. వాలంటీర్లు ఫారం -6,పారం-7 లను ఇష్టానుసారం వాడుతున్నారని సీఈవోకు దృష్టికి తీసుకువచ్చారు. ఒక్కో బీఎల్‌వో నిబంధనలకు విరుద్దంగా పది నుంచి 1000 వరకూ ఫారం %--% 7లను దరఖాస్తు చేస్తున్నారని.. వీరి స్థానంలో దొంగ ఓట్లు సృష్టిస్తున్నారని టీడీపీ ఏపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆరోపించారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో ఫారం %--% 7 ల ద్వారా ఓట్ల తొలగింపుకు సంబంధించిన పలు ఆధారాలను కూడా ఈసీకి సమర్పించారు టీడీపీ నేతలు. నిబంధనలకు విరుద్దంగా ఫారం %--% 7 లను దరఖాస్తు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.దొంగ ఓట్లపై చర్యలు తీసుకోవాలంటూ సీఈవోని కలిసి వైసీపీమరోవైపు అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సైతం నకిలీ ఓట్లపై చర్యలు తీసుకోవాలంటూ సీఈవో ను కలిసింది. మంత్రులు వేణుగోపాల్, దాడిశెట్టి రాజాతో పాటు మాజీ మంత్రి కురసాల కన్నబాబు సీఈవోను కలిసి ఫిర్యాదు చేశారు. చంద్రబాబు హయాంలో 60 లక్షల దొంగ ఓట్లను చేర్పించారని ఆరోపించారు. నకిలీ ఓట్లను తనిఖీ చేసి తొలగించాలని ఫిర్యాదు చేశారు. ఒకే వ్యక్తికి రెండు మూడు చోట్ల ఓట్లను నమోదు చేసుకున్న విషయాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు వైసీపీ నేతలు తెలిపారు. ఆనర్హుల ఓట్లన్నీ తొలగించాలని కోరినట్లు చెప్పారు. రెండు రాష్ట్రాల్లో ఓట్లు ఉండటం, రెండు, మూడు ఓట్లు ఉండటం సమంజసం కాదంటున్నారు వైసీపీ నేతలు. జాగ్రత్తగా ముందుకెళ్తున్న ఎన్నికల కమిషన్కొన్నాళ్లుగా ఆంధ్రప్రదేశ్‌లో అధికార, ప్రతిపక్షాల నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్ కుమార్ మీనాకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీంతో వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పక్కాగా చర్యలు తీసుకునేలా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తున్నారు మీనా. గతంలో కేంద్ర ఎన్నికల సంఘం నుంచి వచ్చిన ఆదేశాలతో డోర్ టూ డోర్ వెరిఫికేషన్ అత్యంత పకడ్బందీగా చేస్తున్నారు. ఓట్ల తొలగింపుపై ఎక్కడెక్కడ ఫిర్యాదులు వస్తున్నాయో అలాంటి నియోజకవర్గాల్లో ఒకటికి రెండుసార్లు వెరిపికేషన్ చేసేలా ఆదేశాలు జారీ చేశారు. ఇదిలావుంటే ఏపీలో అక్టోబర్ 27 న డ్రాఫ్ట్ జాబితా విడుదల తర్వాత నకిలీ ఓట్ల అంశం మరింత ముదిరే అవకాశం ఉంది.

## రామప్ప ఆలయాన్ని దర్శించుకున్న రాహుల్, ప్రియాంక.


### -తెలంగాణలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం



**టీ మీడియా, అక్టోబర్ 18, హైదరాబాద్ :** తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు శ్రీకారం చుట్టారు. ముందుగా వారిద్దరు 13వ శతాబ్దానికి చెందిన రామప్ప ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ములుగు నుంచి పార్టీ బస్సు యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో వారు మాట్లాడారు.తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు శ్రీకారం చుట్టారు. ముందుగా వారిద్దరు 13వ శతాబ్దానికి చెందిన రామప్ప ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ములుగు నుంచి పార్టీ బస్సు యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో వారు మాట్లాడారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు శ్రీకారం చుట్టారు. ముందుగా వారిద్దరు 13వ శతాబ్దానికి చెందిన రామప్ప ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ములుగు నుంచి పార్టీ బస్సు యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో వారు మాట్లాడారు.

## ప్రేమ నటించి ఫొటోలు దిగాడు.

### -అప్‌లోడ్ చేస్తానంటూ బ్లాక్ మెయిల్




**టీ మీడియా, అక్టోబర్ 18,సింగరాయకొండ:** సోషల్ మీడియాలో రకరకాల యాప్‌లద్వారా ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పంపుతూ, స్నేహం నటిస్తూ ప్రేమ పేరుతో ముగ్గులోకి దించి అనంతరం యువతులను బ్లాక్ మెయిల్ చేస్తున్న యువకుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. ముఖ పరిచయం లేని వ్యక్తులు ఫేస్ బుక్ ద్వారా, షేర్ చాట్ యాప్‌ల ద్వారా అమ్మాయిలతో పరిచయాలు ఏర్పరుచుకొని, వారి అశ్లీల ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియా మాధ్యమాలలో పంపునంటూ వేధించి డబ్బులు గుంజుతున్న ఉదంతాలు అక్కడక్కడా వెలుగు చూస్తున్నాయి. తాజాగా అలాంటి ఓ ఘటన ప్రకాశంజిల్లాకు చెందిన యువతికి ఎదురైంది. షేర్‌చాట్ యాప్‌ద్వారా పరిచయమైన ఓ యువతిని ఇలాగే ప్రేమ పేరుతో ముగ్గులోకి దించిన ఓ యువకుడు ఆమెతో సన్నిహితంగా ఉన్న ఫోటోలను సోషల్‌మీడియాలో పెడతానంటూ బెదిరించి రూ.20 వేలు బలవంతంగా తీసుకోవడంతో మనస్థాపానికి గురైన ఆ యువతి పోలీసులను ఆశ్రయించింది. దీంతో కృష్ణాజిల్లాకు చెందిన నిందితుడు లంకా రాజేష్ ను ప్రకాశంజిల్లా సింగరాయకొండ పోలీసులు అరెస్ట్ చేసి కటకటాల వెనక్కి నెట్టారు.

కృష్ణాజిల్లా గుడ్ల వల్లూరు మండలం వేమవరం గ్రామానికు చెందిన లంకా రాజేష్ డిగ్రీ వరకు చదువుకున్నాడు. చెడువ్యసనాలకు బానిసై రాజేష్ సోషల్ ద్వారా రకరకాల యాప్‌లలో చాట్ చేస్తూ అమ్మాయిలకు మెసేజ్ పంపిస్తుంటాడు. ఇతని ఫ్రెండ్ రిక్వెస్టలను యాక్సెప్ట్ చేసిన యువతులతో తరచూ చాట్ చేస్తూ, ఫోన్ ద్వారా పరిచయాలు పెంచుకొని, వాళ్ళను కలిసినప్పుడు బలవంతంగా ఫోటోలు దిగి, అవి చూపిస్తూ బెదిరించి, చిన్న చిన్న మొత్తాలలో డబ్బులు గుంజుకోవడాన్ని అలవాటుగా మార్చుకున్నాడు. ఈ డబ్బులతో జల్సాలు చేస్తూ వచ్చాడు.

ఈ క్రమంలో షేర్ చాట్ యాప్‌ద్వారా ప్రకాశంజిల్లాకు చెందిన ఓ యువతితో పరిచయం పెంచుకున్నాడు. తనతో చనువుగా ఉంటూ, అప్పుడప్పుడు ఆమెను కలుస్తూ వచ్చాడు. ఆ సమయంలో ఆమెతో కొన్ని ఫోటోలు దిగి, అవి చూపించి వాళ్ళ ఇంట్లో వాళ్ళకు, బంధువులకు పంపుతానని బెదిరించాడు. అలా పంపించకుండా ఉండాలంటే ఆమె డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఆ యువతి దగ్గర డబ్బులు తీసుకునేందుకు సింగరాయకొండలోని ఆమె ఇంటికి వచ్చాడు. ఆమె గొంతు మీద కత్తి పెట్టి చంపుతాను అని బెదిరించి, ఆమె నుండి 20 వేలరూపాయలు బలవంతంగా డబ్బులు లాక్కొని వెళ్లాడు. తర్వాత కూడా పదే పదే ఫోన్ చేస్తూ డబ్బులు అడగడం ప్రారంభించాడు. లేకుంటే వాళ్ళ ఇంట్లో వాళ్ళకు, బందువులకు, సోషల్ మీడియా ద్వారా పంపుతానంటూ మళ్ళీ బెదిరించడం మొదలుపెట్టాడు. తన దగ్గర ఇక డబ్బులు లేవని ఆ యువతి మొరపెట్టుకున్నా వినలేదు రాజేష్ చివరకు ఆమె ఫోటోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడంతో పాటు వాటి లింకులను యువతి బంధువులకు పంపించాడు.



## విమానం టాయిలెట్స్‌లో కోట్ల విలువచేసే బంగారం..

### సీజ్ చేసిన అధికారులు

**టీ మీడియా, అక్టోబర్ 18, న్యూఢిల్లీ:** బెంగళూరు: మాల్దీవులు నుంచి కర్ణాటక రాజధాని బెంగళూరులోని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చిన ఇండిగో విమానంలో భారీగా బంగారం పట్టుబడింది. విమానం టాయిలెట్స్‌లోని వాష్ బేసిన్‌లో 3.2 కిలోల బంగారాన్ని గుర్తించి అధికారులు సీజ్ చేశారు. అధికారులు సీజ్ చేసిన ఆ బంగారం విలువ సుమారుగా రూ.1.8 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. మాల్దీవులు నుంచి అక్రమంగా బంగారు బిస్కెట్లు తరలిస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు విమానం ఎయిర్‌పోర్టులో దిగగానే కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. అది గుర్తించిన నిందితులు ఆ బంగారాన్ని టాయిలెట్స్‌లోని వాష్ బేసిన్‌లో పడేశారు. తనిఖీ చేస్తూ వచ్చిన అధికారులకు వాష్‌బేసిన్‌లో ఒక చిన్న సంచి కనిపించింది. దాన్ని తెరచి చూడగా అందులో 3.2 కిలోల బంగారం కనిపించింది. అదే విమానంలో బెంగళూరు నుంచి మరో ప్రాంతానికి వెళ్లాల్సిన ప్రయాణికుడే ఆ బంగారాన్ని టాయిలెట్స్‌లో దాచి ఉంటాడని కస్టమ్స్ అధికారులు అనుమానిస్తున్నారు. దొరికిన బంగారు బిస్కెట్లను సీజ్ చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.



## గగన్‌యాన్ మిషన్‌లో తొలి ప్రయోగానికి ఇస్రో రెడీ..

**టీ మీడియా, అక్టోబర్ 18, అమరావతి :** గగన్‌యాన్ మిషన్‌కు సంబంధించిన తొలి పరీక్ష చేపట్టేందుకు ఇస్రో సిద్ధమైంది. శ్రీహరికోటలోని స్పేస్ సెంటర్‌లో అక్టోబర్ 21న ఉదయం 8.00 గంటలకు టెస్ట్ వెహికిల్ డెవలప్మెంట్ పరీక్ష నిర్వహించనుంది. ఈ ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించదలిచిన వారు ముందుగా రిజిస్టర్ చేసుకోవాలని ఇస్రో సూచించింది. వ్యోమగాముల అంతరిక్ష యాత్ర కోసం ఇస్రో గగన్‌యాన్ చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో వ్యోమగాములు ప్రయాణించే క్రూ మాడ్యుల్, రాకెట్‌పై తొలి పరీక్షను ఇస్రో చేపట్టనుంది. ఈ ప్రయోగం కోసం ఇస్రో టీవీ-డీ1 అనే ప్రయోగాత్మక రాకెట్‌ను సిద్ధం చేసింది. దీని సాయంతో క్రూ మాడ్యుల్‌ను అంతరిక్షంలోకి పంపిస్తుంది. రాకెట్ కొంత ఎత్తుకు చేరుకున్నాక ఎస్కేప్ సిస్టమ్ క్రియాశీలకమై క్రూ మాడ్యుల్‌ను రాకెట్ నుంచి వేరు చేస్తుంది. ఈ క్రమంలో క్రూ మాడ్యుల్ తిరిగి బంగాళాఖాతంలో పడుతుంది. నావికాదళం సాయంతో ఇస్రో క్రూ మాడ్యుల్‌ను స్వాధీనంలోకి తీసుకుని అందులోని డేటా ఆధారంగా రాకెట్, ఎస్కేప్ సిస్టమ్, క్రూ మాడ్యుల్ పనితీరును విశ్లేషిస్తుంది. అత్యవసర సందర్భాల్లో వినియోగించే ఎస్కేప్ సిస్టమ్ పనితీరును ఇస్రో ఈ ప్రయోగం ద్వారా పరీక్షిస్తోంది.